

జీసీసీ మేనేజర్‌గా సందీప్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న సందీప్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ ఆసిఫాబాద్ సొసైటీ మేనేజర్‌గా ఊట్నూర్ డివిజనల్ మేనేజర్ సందీప్‌కుమార్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం అయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన తారాచంద్ అనారోగ్య కారణాలతో సెలవులో వెళ్లడంతో సందీప్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సదాశివం, గోవిందరావు, చందు, సంతోష్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా డివిజనల్ స్థాయి క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో గురువారం డివిజనల్ స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్, టెన్నికాయిట్ క్రీడా పోటీలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి ప్రారంభించారు. పోటీల్లో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ విద్యార్థులను ఎంపిక చేయనున్నామని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో నిర్వహించే జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏటీడీఓ చిరంజీవి, స్పోర్ట్స్ ఆఫీసర్ షేకు, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, మీనారెడ్డి, పీడీలు, పీఈటీలు కృష్ణమూర్తి, శ్రీను, మంగపతి, లక్ష్మణ్, సుభాష్, హీరాబాయి, రవి, మహేదు, పాండురంగ్, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని గుంటూరు కాలనీ, సర్‌సిల్క్ కాలనీ, ఓల్డు కాలనీలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 1.00 గంట వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

గ్రామ పంచాయతీలు గాడిన పడేదెన్నడో?



- స్థానిక సంస్థల ఎన్నికలపై వీడని సందిగ్ధం
- 20 నెలలుగా జీపీలకు పాలకవర్గం కరువు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న సమస్యలు
- నిధులు లేక పంచాయతీ కార్యదర్శుల అవస్థలు

చింతలమానేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలక వర్గాలు లేక గ్రామ పంచా యతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? గ్రామ పంచాయతీలకు నిధులు ఎప్పుడు వస్తాయో అని ప్రజలు ఆశగా ఎదురుచూ స్తున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి 20 నెలలు కావస్తోంది. ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినా బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై నేటికీ సందిగ్ధం నెలకొంది.

● 15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలుండగా కొన్ని మేజర్ జీపీలు ఉండగా, మరికొన్ని మైనర్ జీపీలున్నాయి. 500 జనాభా ఉన్న ప్రతీ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా చేయడంతో ప్రజలకు పంచాయతీల పాలన అందుబాటులోకి వచ్చినా ప్రభుత్వం నుండి నిధులు రాక ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంలా మారింది. సర్పంచుల పదవీకాలం 20 నెలల క్రితం ముగిసింది. అప్పటి నుండి గ్రామాల్లోని సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. కొంత కాలం ప్రత్యేక అధికారులను నియమించినా అదనపు పని భారంతో సమస్యలపై దృష్టి పెట్టలేక పోయారు. ఫలితంగా గ్రామాల్లోని పారిశుధ్య, తాగునీరు, తదితర కార్యక్రమాలు సక్రమంగా సాగడం లేదు.

● అప్పుల్లో కార్యదర్శులు..

గ్రామ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లుగా మారింది. గత బీఆర్‌ఎస్ హయాంలో ప్రతీ గ్రామ పంచాయతీకి ప్రభుత్వం ట్రాక్టర్లు అవసరమని, వాటి ద్వారా పరిసరాలు పరిశుభ్రం చేసుకునే అవకాశం ఉంటుం దని ట్రాక్టర్ షోరూంల ద్వారా అరువుపై ట్రాక్టర్లను మంజూరు చేశారు. నాలుగేళ్ల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సరిగ్గా నిధులివ్వడంతో ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించడంతో పాటు విద్యుత్ ఖర్చులు చేస్తూ గ్రామ పంచాయతీల నిర్వహణ సక్రమంగా నిర్వహించారు. మరి కొన్ని నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు వస్తాయని భావించిన ప్రభుత్వం పంచాయతీలకు నిధులు నిలిపివేసింది. అప్పటికే జీపీల్లో పారిశుధ్య చర్యలు, మురికి కాలువల నిర్మాణాలు, సిమెంట్ రోడ్లు, బోరుబావుల మరమ్మతులు వంటి పనులు చేసిన సర్పంచులు నిధుల్లేక నీరసించి పోయారు. జిల్లాలో ఉన్న ప్రతీ జీపీ కార్యదర్శి 2నుండి 3 లక్షల వరకు అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినట్లు తెలుస్తోంది.

● పైసా ఇవ్వని ప్రభుత్వం..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదు. గత మూడేళ్లగా స్టేట్ ఫైనాన్స్ నిధులు పంచాయతీలకు మంజూరు కావడం లేదు. జనాభా ప్రాతిపదికన మైనర్, మేజర్ గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులు సైతం పెండింగ్‌లో ఉండడం వల్ల జీపీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు కావడం లేదు. కనీస అవసరాలకు కార్యదర్శులు అప్పులు తెచ్చి పెడుతున్నట్లు తెలుస్తోంది. కేవలం మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలను మాత్రమే ప్రభుత్వం అందిస్తోంది. అలాగే రెగ్యులర్ కార్యదర్శుల వేతనాలు అందజేస్తూ ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల వేతనాలను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి..

- ధోని శ్రీశైలం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. గతంలో బీఆర్ ఎస్ నిర్లక్ష్యం చేసింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో పని చేస్తోంది. ప్రభుత్వం నిధులు కేటాయిం చి గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి.

పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్



రెబ్బెనలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

రెబ్బెన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటకృష్ణ విద్యార్థులకు పోలీసు స్టేషన్ లోని రికార్డులను, పరిసరాలను, విధులను వివరించారు. ఫింగర ప్రింట్స్ మిషన్, నేర సంస్థల వద్ద జప్తు చేసిన వస్తువులను, ఆయుధాల వినియోగంపై వివరించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో గురువారం కేజీబీవీ విద్యార్థులకు ఎస్సైస అనిల్ కుమార్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో పని తీరు, ఆయుధాల వినియోగం, స్టేషనరీ నమోదు, సమాజంలో పోలీసుల పాత్ర గురించి వివరించారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. ధైర్యంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాల ను అధిరోహించాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

దహెగాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుడుంబా రహిత గ్రామంగా ఖర్జీ గ్రామాన్ని తీర్చిదిద్దుదామని ఎస్సై విక్రమ్ అన్నారు. గురువారం దహెగాం మండలంలోని ఖర్జీ గ్రామంలో ప్రజలతో, యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడుంబాను నిర్మూలిస్తే ఆర్థికంగా అభివృద్ధి సాధించి ఆలోచన సరిళి మారుతుందన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే విద్యా, ఉపాధి వైపు దృష్టి సారించవచ్చన్నారు. ఖర్జీ నుంచి మొదలైన గుడుంబా నిషేదం దహెగాం మండల వ్యాప్తంగా విస్తరించాలని అన్నారు. గ్రామంలో గుడుంబా అమ్మినా, తయారు చేసి, రవాణా చేసిన పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో ఖర్జీ గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు చర్యలు



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు అనువైన స్థలాన్ని గురువారం అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ అవరణలో అనువైన ప్రదేశంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులో భాగంగా స్థలాన్ని పరిశీలించామని తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ

దహెగాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని ఎరువుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయాదికారి వెంకటి గురువారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ ను పరిశీలించి ఎప్పటికప్పుడు వివ రాలు నమోదు చేయాలని సూచించారు. రైతులు అడిగిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారులు ఉన్నారు.

ఫ్లాగ్ డే సందర్భంగా యువత, విద్యార్థులకు పోటీలు

ఆసిఫాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫ్లాగ్ డేను పురస్కరించుకుని యువత, ఔత్సాహికులను షార్ట్ ఫిలిం, ఫొటోగ్రఫీ పోటీలు, విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రఫీ పోటీల్లో పాల్గొనే వారు నూతనంగా రూపొందించిన వీడియోలు, తీసిన ఫొటోలు ఉండాలన్నారు. పోటీల్లో పాల్గొనే సేవలకు సంబంధించిన ఫొటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన , ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని చెప్పారు. అదే విధంగా పోలీసులు చేసినటువంటి సేవలు 10/8 సైజ్‌లో అందించాలని సూచించారు. ఈ ఫొటోలు, వీడియోలను ఈ నెల 28వ తేదీలోగా జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ కోర్ విభాగంలో(ఐటీ కోర కో ఆర్డినేటర్ 8712670527)కు ఫొటోలు, పెన్‌డ్రైవ్‌లో షార్ట్ ఫిలిను అందించాలని తెలిపారు. విద్యార్థులకు 'డ్రగ్స్ నివార ణలో పోలీసుల పాత్ర విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు' అన్న అంశంపై ఆన్‌లైన్‌లో తెలుగు, ఉర్దూ ఇంగ్లీష్ మూడు భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. 6 నుంచి పీజీ వరకు చదువుతున్న వారు పాల్గొనవచ్చని సూచించారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప



కేసీఆర్‌తో కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్/సిర్పూర్(టి), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గురువారం మాజీ సీఎం కేసీఆర్‌నుసిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాసేపు చర్చించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

● సంక్షిప్తం..

● ఆసిఫాబాదరూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లో డిసెంబరు 9న నిర్వహించే బహిరంగసభకు ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తుడుందెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబబ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్, జాతీయ నాయకులు బుర్స పోచయ్య కోరారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

● రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన తోట అనూష ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు గోవాలో నిర్వహించే జాతీయ స్థాయి సీనియర్ మహిళల సెపక్ తక్రా క్రీడ టీంకు జట్టుకు ఎంపికైనట్లు సెపక్ తక్రా జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ మల్లేష్ తెలిపారు.

● ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం సవ్వాతిగూడ గ్రామానికి చెందిన జంకుబాయి అనే గర్భిణిని గురువారం 108 సిబ్బంది ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది.

● కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాసిమెట్ట దండారి సంబరాలలో గురువారం మహారాష్ట్ర కేళాపూర్-ఆర్ని నియోజకవర్గం ఎమ్మెల్యే తోడసం రాజు పాల్గొని మొక్కుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ పవర్‌గూడ దండారిలో పాల్గొన్నారు.

● పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగంగా పూర్తి చేయాలని డీఎల్‌పీవో హరిచంద్ర అన్నారు. గురువారం మండలంలోని ఆగర్‌గూడ, కమ్మర్‌గాం, మురళీగూడ గ్రామాల్లో పర్యటించారు.

● కౌటాల, (ఆంధ్రజ్యోతి): పశువులను రోడ్లపై వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. కౌఆల మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి గ్రామంలో చాటింపు వేయించారు.

● సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు సమస్యలు పరిష్కారం అయ్యాకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని తహసీల్దార్, ఎంపీడీవో నిర్ణయానికి వచ్చినట్లు ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మేడిపల్లి గ్రామంలో అటవీ శాఖాధికారులు గ్రామస్థులకు మధ్య వివాదం జరిగిన కారణంగా అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకుని నిర్ణయానికి వచ్చినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

● కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు తనకు అన్నం పెట్టడం లేదని, తన ఆస్తిని వాడుకుంటున్నారని నజ్రూల్‌నగర్‌కు చెందిన సుశీల గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగింది.

● కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అత్యవసర సేవల 108, 102 అంబులెన్స్‌లను జిల్లా మేనేజర్ నరేష్ యాదవ్ తనిఖీ చేశారు. మెడికల్ స్టాక్, ఎక్విప్‌మెంట్ పని తీరు, రికార్డులను పరిశీలించారు.

గంగాపూర్‌కు ఆర్టీసీ బస్సు సేవలు



ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామస్థులు

చింతలమానేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపూర్, కోర్సిని గ్రామాలకు ఆర్టీసీ బస్సు గురువారం ప్రారంభం అయింది. గత కొన్ని రోజులుగా ఈ గ్రామాలకు ఆర్టీసీ సేవలు నిలిచి పోవడంతో గ్రామస్తులు ఇటీవల మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు సమస్యను విన్నవించగా వెంటనే చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బందిని గ్రామస్థులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, సుధాకర్, జగ్గయ్య, హరీష్, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

కుమరం భీంకు ఘన నివాళి

పెంచికలపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండల కేంద్రంలో గురువారం కుమరం భీం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు ఆదివాసీలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివాసీ హక్కు సాధన కోసం ఐక్యంగా ఉండి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సకారాం, మధుకర్, మల్లేష్, ప్రభాకర్, భుజంగరావు, మధుకర్, పుల్లయ్య, భాస్కర్, మధునయ్య, శివయ్య, బాపురావు, జయారం, శ్యాంరావు, లచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): గుడ్లబోరి, వైగాం న్యూకాలనీలో కుమరం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, ఆదివాసీ నాయకులు హనుమంతు, బాబురావు, దుర్గయ్య, వసంత్‌రావు, బాజీరావ్, వామన్ పాల్గొన్నారు.

ఆర్యక్షత్రియ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఆరె కులస్తులు

ఆసిఫాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరె కులస్తులకు ఆరె క్షత్రియ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం ఆరె సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆరె కులస్తులకు ఆరె క్షత్రియ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే వారని అన్నారు. కొన్ని రోజులుగా మంజూరు చేయడం లేదని దీని వల్ల కులస్తులు విద్య, ఉద్యోగ అవకాశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులతో మాట్లాడి త్వరిగతిన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరెకుల సంఘం నాయకులు శంకర్, మోహన్, కిశోర, దౌలత్, శంకర్, మారుతి, నానాజీ, కాళీదాస్, లావణ్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో ఆశా కార్యకర్త మృతి



కమల(ఫైల్)

బెజ్జూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఇప్పలగూడ గ్రామానికి చెందిన కనక కమల(45) అనే ఆశా కార్యకర్త గురువారం పాము కాటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇంటి వెనక పెరట్లో పని చేస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. దీంతో కమల కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు పరుగెత్తుకు వచ్చి వెంటనే ఆమెను బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఆశా కార్యకర్తలు సంతాపం ప్రకటించారు.

గంజాయి మొక్కలు స్వాధీనం



గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

జైనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జైనూరు మండలం జెండాగూడ గ్రామ శివారులో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ముందస్తు సమాచారం మేరకు గురువారం గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. పత్తి, కంది పంటల మధ్యంలో మూడు గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పంచుల సమక్షంలో మొక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేసిన వ్యక్తి పరారీలో ఉన్నాడని చెప్పారు. అతడిని పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

గుంతలు..ప్రమాద ఘంటికలు

- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు





కోతకు గురైన సిర్పూర్(టి)- కౌటాల ప్రధాన రహదారి, సిర్పూర్(టి)- మహారాష్ట్ర రోడ్డుపై కల్వర్టు వద్ద ఏర్పడిన గుంత

సిర్పూర్(టి), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై గుంతలు ప్రజల ప్రాణాలకు ప్రమాద ఘంటికలుగా మారాయి. ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు, ముఖ్యంగా వర్షాకాలంలో నీటితో నిండి పోయి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. సిర్పూర్(టి) నియోజక వర్గ కేంద్రమైనా. అభివృద్ధిలో మాత్రం వెనకంజే కనిపిస్తోంది. ప్రధానంగా రవాణా సమస్యతో స్థానికులు సత మతం అవుతున్నారు. నిత్యం మండల కేంద్రానికి వేల సంఖ్యలో చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. దీంతో పాటు మహారాష్ట్రకు అధిక సంఖ్యలో వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లన్ని అడుగడుగున గుంతలు పడి ఉండడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.



సిర్పూర్(టి)లో దెబ్బతిన్న ప్రధాన రహదారి

ఇది వరకే రోడ్లపై ఉన్న గుంతలకు తోడు ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు మరింత పెద్దగా ప్రమాదకరంగా మారాయి. దీంతో ఒక వాహనం వెళ్లినా తరువాత మరొకటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే ఎదురుగా వచ్చే వాహనాలతో ఢీకొట్టే ప్రమాదం ఏర్పడింది. మరికొన్ని దారుల్లో కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ దారుల్లో అవస్థలు పడుతూ స్థానికులు ఇతర గ్రామాల వారు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు ముగియడంతో దుమ్ము తో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్నా సంబంధిత అధికారులు ప్రస్తుతం ఎటు వంటి పరిష్కార చర్యలు తీసుకోకపోవడంపై స్థాని కుల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- సిర్పూర్(టి)- కౌటాల వెళ్లే రహదారిలో ఇటీవల భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. అధికారులు కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. అది మరిచి కొంచెం అటువైపుగా వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ నుంచి హుడ్కిలి వెళ్లే రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. గత నెలలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఆటో గుంతలో కూరుకు పోయే కరమంలో డ్రైవర్ అప్రమత్తతో పెద్ద ప్రమాదం తప్పింది. దుబ్బగూడ వద్ద గుంతల కారణంగా ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.
- సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో పెద్దబండ గ్రామ మూల మలుపు వద్ద పెద్ద గుంత ఏర్పడింది. అసలే మూలమలుపు కావడం.. ఆపై గుంత ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వాహనం ప్రమాదంలో మృతి చెందాడు. అనంతరం మరమ్మతులు చేపట్టినా ఆరు నెలలకే యథావిధిగా మారింది. రాత్రి వేళ భయం భయంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

జన్నారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం లోని మొర్రిగూడ గ్రామం వద్ద ప్రధాన రహదారిపై జీప్ మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. జన్నారం ఎస్‌ఐ గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గన్‌పూర్‌కు చెందిన దొసర్ల అంకన్న(46), ఉట్నూర్ మండలం నాగాపూర్‌కు చెందిన సిడాం మోతిరాం(50) ద్విచక్ర వాహనంపై గురువారం జన్నారం బయల్దేరారు. ఈ క్రమంలో జన్నారం నుంచి జైనూరు వైపు వెళ్తున్న జీప్ మొర్రిగూడ సమీపంలో ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దొసర్ల అంకన్న, సిడాం మోతిరాం ఇద్దరూ రహదారిపై ఎగిరిపడి తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృత చెందారు. ప్రమాదం జరిగిన విషయాన్ని అక్కడి వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జీప్ నడుపుతున్న షేక్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పులి సంచారం

కాగజ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కడంబా అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోంది. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై కడంబా అటవీ ప్రాంతంలోకి ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. గురువారం కడంబా అటవీ ప్రాంతంలో ఉన్నట్టు పాదముద్రలను గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన పులిగా అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

మద్యం దుకాణాలకు ముగిసిన దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలో 2025-2027 నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. జిల్లాలోని 32 మద్యం దుకాణాలు ఉన్నారు. కాగా ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో 16, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 16 మద్యం దుకాణాలు ఉన్నాయి. నూతన మద్యం పాలసీలో బాగంగా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 26 నుంచి మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెట్టగాజిల్లాలోని 32 దుకాణాలకు 622 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఆసిఫాబాద్ డివిజన్‌లోని 16 దుకాణాలకు 323, కాగజ్‌నగర్‌లోని 16 దుకాణాలకు 299 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్లకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని భావించింది. ఈ మేరకు దరఖాస్తు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గురువారం వరకు గడువు పెట్టింది ఈ మేరకు జిల్లాలోని 32 మద్యం దుకాణాలకు 667 దరఖాస్తులు వచ్చాయి. గడువు పెంచడంతో మరో 45 దరఖాస్తులు అదనంగా వచ్చాయి. దీంతో ఒక్కొ దుకాణానికి రూ. 3 లక్షల చొప్పున రూ. 20.01 కోట్లు ఆదాయం సమకూరింది. గతంలో జిల్లాలోని 32 దుకాణాలకు 1020 దరఖాస్తులు రాగ రూ. 20.40 కోట్లు ఆదాయం సమకూరింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 27న సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మద్యం దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలు లోకి రానుందని అధికారులు చెబుతున్నారు.

భూముల వివరాలు పక్కాగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సేకరించిన భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి గురువారం తహసీల్దార్‌లతో వివిధ అభివృద్ధి పనుల కోసం సేకరించిన భూములు, ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములు, దేవాదాయ, వక్ఫ్, సీలింగ్, లావుని పట్టా భూముల వివరాల నమోదుపై సమీక్షి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల కొరకు సేకరించిన భూములు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు, రహదారులు, రైల్వే లైన్ నిర్మాణ పనులలో సేకరించిన భూములు, ప్రభుత్వ భూములు, సీలింగ్, లావుని పట్టా, దేవాదాయ, వక్ఫ్ భూముల వివరాలను 22ఏ నిషేధిత జాబితాలో నమోదు చేయాలన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెరుగైన విద్యా విధానాలు అమలు చేసేందుకు అంతర్జాతీయ ఎక్స్‌జర్ విజిట్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. అంతర్జాతీయ ఎక్స్‌జర్ విజిట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి విద్యాధికారి దీపక్ తివారి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రమాదేవితో కలిసి ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తున్నాం

ఆసిఫాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ వద్ద గోమాతను రక్షించినందుకు సోను సింగ్ (ప్రశాంత్)పై ఎంఐఎం గుండాలు చేసిన దాడిని ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. నిందితులను శిక్షించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయ్, ప్రసాద్, మురళీ, రాంబాబు, జయరాజ్, నరేష్, సుజిత్ పాల్గొన్నారు.

పశువుల కాపరులపై ఎఫ్ఎస్‌వో దాడి

దహెగాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం ఒడ్డుగూడ గ్రామానికి చెందిన పశువుల కాపర్లు రామన్న, బూషయ్యలపై ఎఫ్ఎస్‌వో దాడి చేశారు. గురువారం పశువుల కాపర్లు పశువులను మేపడానికి అటవీ ప్రాంతానికి వెళ్లారు. రోజువారిగా పశువులను మేపుతుండగా ఎఫ్ఎస్‌ఓ సద్దాం అక్కడికి వెళ్లి పశువుల కాపర్లపై దుర్భష లాడుతూ దాడి చేశారు. ఈ మేరకు పశువుల కాపర్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై విక్రమ్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

బెజ్జూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, లబ్ధిదారులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా లేని వారికి అర్హులైన వారికి ఐకేపీ ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందని, ఎవరైతే ఇండ్ల నిర్మాణాలు మొదలు పెటటలేదో వారు త్వరగా మొదలు పెట్టాలన్నారు. టెక్నికల్ సమస్య వల్ల కొన్ని ఇండ్లకు బిల్లులు పడలేదని రెండు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సాహెల్, ఏఈ రాజన్న, ఏపీఓ మోహన్‌దాస్, ఏపీఎం వైకుంఠం, కార్యదర్శులు, సీసీలు పాల్గొన్నారు.

భీమన్‌గొందిలో గుస్సాడీ సంబరాలు



గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

కెరమెరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమన్‌గొంది గ్రామంలో గురువారం గుస్సాడీ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఏటా దీపావళి పండగ పర్వదినం తరువాత ఆరంభమైన దండారి ఉత్సవాలు గోయగాం గ్రామ పంచాయతీలో కోలాం గిరిజన గ్రామమైన భీమన్‌గొందిలో ఆదివాసీ సంస్కృతి ప్రకారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగల్‌గొంది గ్రామానికి చెందిన గుస్సాడీ కళాకారులు భీమన్‌గొంది గ్రామంలో దండారి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ భీము, గ్రామస్తులు పారండురంగ్, ఆనంద్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చిన ముగ్గురిపై కేసు

వాంకిడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం జోగాపూర్ శివారు అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చిన లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దరావత్ బీమా, నగోస్ బీర్సన్, గుర్నులె తిరుపతిలపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఆసిఫాబాద్ ఎఫ్ఆర్వో గోవింద్ సింగ్ సర్దార తెలిపారు. వన్యప్రాణులను వేటాడడం చట్ట రీత్యా నేరమని ఎవరైనా వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఝాన్సీలక్ష్మి, ఎఫ్ఎస్ఓ సాయిచరణ్, ఎఫ్‌బీఓలు ప్రభాకర్, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ప్రత్యేక ప్లాంటు ఏర్పాటుకు చర్యలు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

శ్రీరాంపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో లభ్యమయ్యే ఓవర్‌బర్డెన్, ఎస్‌టీపీపీ ఫ్లైయాష్ నుంచి అరుదైన మూలకాల సేకరణకు కొత్తగూడెంలో ప్రత్యేక ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు సీఎండీ ఎన్ బలరాం అన్నారు. ఈ మేరకు సింగరేణి సంస్థ నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్(ఎన్ఎఫ్‌టీడీసీ)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఎన్ఎఫ్‌టీడీసీ డైరెక్టర్ బాలసుబ్రమణియన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం వారు మాట్లాడు తూ ఓసీపీల్లోని ఓవర్ బర్డెన్(ఓబీ) మట్టితో పాటు సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో లభ్యమయ్యే ఫ్లైయాష్‌లో అరుదైన మూలకాల లభ్యతపై తమకు సమాచారం ఉందన్నారు. పైలట్ ప్లాంటు ద్వారా వాటిని గుర్తించి అనంతరం వ్యాపార దృక్పథంతో ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. సింగరేణి తన వ్యాపార విస్తరణను మరింత విస్తృతంగా చేపట్టనుందని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, జీఎం(కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి శ్రీనివాస్, జీఎం(బిజినెస్ డెవలప్‌మెంట్) రాందాస్, జీఎం(ఎక్స్‌ప్లోరేషన్) శ్రీనివాసరావు, ఎన్.ఎఫ్.టీ.డీ.సీ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



26న మెగా జాబ్‌మేళా

బెల్లంపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో ఈ నెల 26న సింగరేణి, నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సహకారంతో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సీఎండీ బల్‌రాం, ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. జాబ్‌మేళాకు సంబంధించి సీఎండీ కార్యాలయంలో గురువారం పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. మెగా జాబ్‌మేళాలో దాదాపు 75 కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. నాలుగువేలకుపైగా ఖాళీలు ఉన్నాయని అన్నారు. నిరుద్యోగులకు, యువకులకు సువర్ణ అవకాశమన్నారు. నిరుద్యోగ యువతి, యువకుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సీసీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు పొందవచ్చునన్నారు. ఈ మెగా జాబ్ మేళా ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులందరూ సమయానికి ఏఎంసీ క్రీడామైదానికి చేరుకోవాలని చెప్పారు. విద్యార్హతలు పది నుంచి ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, బిటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బిఫార్మ, ఎంఫార్మసి చేసినవారందరికి ఈ జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

కోల్ ఇండియా పోటీల్లో పతకం సాధించాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇడియాలో ఫుట్‌బాల్ పోటీల్లో తప్పక పతకం సాధించాలని సింగరేణి క్రీడా కీర్తిని చాటాలని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ తెలిపారు. గురువారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో మందమర్రి ఏరియా 61వ వార్షిక క్రీడల్లో భాగంగా ఫుట్‌బాల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులకు కరచాలనం అందించి పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన పోటీలను ప్రారంభించారు. అంతకుముందు కాసిపేట1లో పంపు ఆపరేటర్‌గా పని చేస్తూ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా అద్భుతంగా రాణించిన మంజిత్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన మృతికి సంతాపంగా మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఎస్ఈ రాము, ఏఐటీయుసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, చర్చల కమిటీ ప్రతినిధి సీవి రమణ, క్రీడల గౌరవ కార్యదర్శి ఎం. కార్తిక్‌లు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో హోరాహోరీగా జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో కాసిపేట గ్రూపు విజేతగా నిలువగా కేకే1 గ్రూపు రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ క్రిష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం చేసి.. చెత్తాచెదారం తొలగించి..



చెత్తాచెదారం తొలగిస్తున్న సింగరేణి అధికారులు

రెబ్బెన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు గురువారం శ్రమదానం చేసి చెత్తాచెదారం తొలగించారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా గురువారం గోలేటిలోని శ్రీ సత్యసాయి బాబా ఆలయం, జీటీసీఓఏ క్లబ్ పరిసరాల్లో స్వచ్ఛత కోసం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా జీఎంతో పాటు ఏరియా అధికారులు, ఉద్యోగులు చెత్త, గడ్డి, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. గాలి వానకు విరిగి పోయి ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. స్వచ్ఛత కోసం సింగరేణి సిబ్బంది పడుతున్న శ్రమను, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న తీరును జీఎం ప్రశంసించారు. బొగ్గు ఉత్పత్తి, కార్యాలయాల్లో విధులే కాకుండా సమాజ శ్రేయస్సు, పరిసరాల శుభ్రత కోసం బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఉద్యోగులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని జీఎం విజయ భాస్కర్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి తిరుపతి, ఉజ్వల్‌కుమార్ బెహరా, ఎస్ఓటు జీఎం రాజమల్ల, డీజీఎం మదీనాభాషా, ఇన్విరాల్‌మెంట్ అధికారి హరీష్, జ్ఞానేశ్వర్, శ్రీధర్, రవికుమార్, సాగర్, ఐటీ మేనేజర్ ముజీబ్, శ్రీనివాస్, స్వామి, ఈఈ రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

కాసిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు కార్మికులందరు సమిష్టిగా కృషి చేయాలని మందమర్రి సేఫ్టీ జీఎం రఘుకుమార్ అన్నారు. గురువారం కాసిపేట గనిలోని పనిస్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా 4ఎస్13 అనుమతులు రావడంతో సన్నాహక ప్యానెల్‌ను పరిశీలించామని చెప్పారు. పనిస్థలాల్లో కార్మికులు అప్రమత్తంగా ఉండి రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. కొత్తగావచ్చిన ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు , బ్లాస్టర్ల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సేఫ్టీఆఫీసర్ భూశంకరయ్య, గనిమేనేజర్ సతీష్, రక్షణాధికారి నిఖిల్‌అయ్యర్, సర్వేయర్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌తో.. జరభద్రం



దుకాణాల్లో పిల్లలను ఆకర్షించే చిప్స్ ప్యాకెట్లు, నోరూరించే విధంగా వేలాడుతూ దర్శనమిచ్చే జింక్‌పుడ్స్ నేడు పిల్లలకు శాపంగా మారుతున్నాయి. నేటికాలం పిల్లలు ఇంటి వంటకాల కంటే బయట దొరికే బర్గర్, పిజ్జా, ఫ్రైడ్‌రైస్, ఫ్రెంచ్ ఫ్రైస్, చల్లని పానీయాలు, మ్యాగీ, చిప్స్ మొదలైన వాటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే ఇలాంటి జింక్‌పుడ్స్ నివారించకుంటే పిల్లల శారీరక మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– కాసిపేట, ఆంధ్రజ్యోతి

● పిల్లలకు శాపంగా మారుతున్న చిరుతిళ్లు ● అప్రమత్తతతోనే రోగాలను అధిగమించవచ్చంటున్న వైద్య నిపుణులు

అధిక చక్కెర తీసుకోవడం వల్ల పిల్లల్లో చిరాకు, ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ యేడాది మేలో కేంద్ర స్కూ ల్ విద్యా సమితి (సీబీఎస్ఈ) అన్ని పాఠశాలల్లో షుగర్ బోర్డులు పెట్టాలని ఆదేశించింది. దీని సూచన మేరకు ప్రభుత్వ విద్యాశాఖ కూడా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జింక్‌ఫుడ్ ప్రమాదాన్ని పిల్లలకు కనబడే విధంగా హెచ్చరిక బోర్డులను పెట్టాలని ఆదేశించింది.

జింక్‌ఫుడ్‌తో వచ్చే వ్యాధులు

పిల్లల ఆరోగ్యంపై కేంద్ర ఆరోగ్య సంస్థలు ఐదే ళ్లకు ఒకసారి సర్వేలు నిర్వహిస్తు న్నాయి.



ఇందులో విస్తు గొలిపే విషయాలు బయటపడడంతో ఆరోగ్యసంస్థలు ఒక్కసారిగా అవాక్కయ్యాయి. జింక్‌ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లలు ఉండాల్సిన బరువు కంటే ఎక్కువగా ఉంటున్నారు. ప్రతీ వంద మందిలో 15 మంది పిల్లలు రెండో రకం మధుమేహం (టైప్2) పెద్ద వాళ్లల్లో వచ్చే షుగర్ జబ్బు వస్తున్న లక్షణాలున్నట్లు వైద్యులు కనుగొన్నారు. 7,8 ఏళ్ల పిల్లలు షుగర్ వ్యాధిబారిన పడడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం

భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్)ల సలహా ప్రకారం మనం ప్రతీ రోజు తినే ఆహారంలో ధాన్యాలు, పప్పు గింజలు, పాలు, పెరుగు, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, కొవ్వు పదార్థాలు, నూనెలు, విత్తనాలు ఉండేలా చూసుకోవాలి.

●గుడ్డు అత్యంత చౌకగా లభించే ఉత్తమ ఆహారం. రోజు సగటున పిల్లలకు నాలుగు గుడ్లు తినిపించవచ్చు

●పాలకన్నా పెరుగు మంచి ఆహారం. కొంత పులిసిన పెరుగు పొట్టలో మంచి బ్యాక్టీరియాను పెంచి ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.

● మొలకెత్తిన పప్పు ధాన్యాలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని ఇంట్లోనే తయారు చేసుకుని మొలకెత్తిన పెసళ్లతో దోశలు వేసి పిల్లలకు తినిపించాలి.

వ్యాయామం కీలకం

కార్పోరేట్ విద్యా విధానం మనం చదువుల స్వభావాన్ని మార్చివేసింది. క్షణం తీరిక లేకుండా చదువులు, ర్యాంకుల వెంట పరిగెత్తే పిల్లలు, ఆట పాటలు లేని చదువులు, ర్యాంకుల సాధనే లక్ష్యంగా మలిచిన చదువుల వల్ల పిల్లలు బాల్యంలోనే మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలను ఎంచుకుంటున్నారు. శారీరక ధృడత్వం ఉన్నప్పుడు మానసిక వికా సం సాధ్యపడుతుంది. అందుకే వ్యాయామానికి ఆట, పాట లకు రోజువారి చదువులో చోటు ఉండాలి. ప్రతి పాఠశాలలో, ఇంట్లోను ఈ వాతావరణం కనిపించేలా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు చేపట్టాలి. దీనికి తోడు పిల్లలకు మంచి నిద్ర ఎంతో అవసరం. మంచి నిద్ర ఉన్నప్పుడే మంచి ఆరోగ్యంగా మెదడు చురుకుదనంగా పనిచేస్తుంది.



బాల్యం రోగాలతో బందీ అవుతుంది

డాక్టర్ విక్రమ్, పిల్లల వైద్య నిపుణులు, మంచిర్యాల



పిల్లలు జింక్‌ఫుడ్‌కు అలవాటు పడిన తర్వాత బాల్యం రోగాలతో బందీ అవుతుంది. పోషకాహారం లోపం వల్ల తగినంత ఎత్తు, బరువు లేని పిల్లలుగా తయారవుతున్నారు. పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలి.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ప్రకాష్ బానవత్, కౌన్సెలింగ్ సైకాలజిస్టు అండ్ లైఫ్ కోచ్



పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల వల్లనే జింక్‌ఫుడ్ బారి నుంచి కాపాడుకోవచ్చు. ఇంట్లో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉంచాలి. పిల్లలతో కలిసి వంట చేయడం ద్వారా ఇంటి ఆహారం పట్ల ఆసక్తి పెరుగుతుంది. టీవీ, మొబైల్ ప్రకట నల ప్రభావం పిల్లలపై పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. పిల్లలకు పండ్లు, డ్రైఫ్రూట్స్, ఇంట్లో తయారు చేసే పిండి వంటలు అందించాలి.

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగింపజేస్తున్న ఎస్ఐ

భీమిని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : భీమిని పోలీస్‌స్టేషన్‌పరిధిలోని జగ్గయ్యపేట, పెద్దపల్లి గ్రామాల మధ్యలో ఉన్న రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను గురువారం భీమిని ఎస్ఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్ సహాయంతో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి వీటిని తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు లక్ష్మణచారి, మహేశ్వరి, వినోద్‌కుమార్, పెద్దపేట గ్రామస్థుడు అక్బర్ పాషా పాల్గొన్నారు.

విధుల నుంచి ఏఎస్‌డబ్లువో తొలగింపు

లక్షెట్టిపేట, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పోస్టు మెట్రిక్ హాస్టల్ వార్డెన్ రాజగోపాల్‌రావు ఆత్మహత్యాయత్నంపై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. ఏఎస్‌డబ్లువోగా అదనపు బాధ్యతల్లో ఉన్న బొల్లంపల్లి సురేష్ తాను విధులను అడ్డుపెట్టుకుని హెచ్‌డబ్లువోలను వేదిస్తున్నట్లు గుర్తించిన అధికారులు బుధవారం సాయంత్రం ఏఎస్‌డబ్లువో విధుల నుంచి తొలగించారు. వార్డెన్ రాజగోపాల్‌రావు లక్షెట్టిపేటకు వచ్చిన విషయం తెలసుకున్న నూతన ఏఎస్ డబ్లువో(ఎఫ్ఏసీ) ధర్మానంద్‌గౌడ్ గురువారం తన నివాసానికి చేరుకుని రాజగోపాల్‌రావును పరామర్శించారు. ప్రస్తుతం రాగగోపాల్ వద్ద పూర్తి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా గతంలో అదనపు బాధ్యతల్లో ఉన్న సురేష్‌ను సస్పెండ్ చేయాలని వార్డెన్ రాజగోపాల్‌రావుతో పాటు ఆయన కుటుంబీకులు, మరికొంత మంది హెచ్‌డబ్లువోలు డిమాండ్ చేసారు.

డ్రోన్‌లతో రైతుల సమయం, ఖర్చులు ఆదా..

నెన్నెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాగురంగంలో డ్రోన్‌లను ఉపయోగిస్తే రైతులకు శ్రమతో పాటు ఖర్చు తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి పుప్పాల శృజన అన్నారు. గురువారం బొప్పారంలో రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్‌తో పొలంలో పిచికారి చేసి చూయించారు. డ్రోన్‌ల సాయంతో వివిధ పంటల్లో ఎరువులు చల్లడం, పురుగు మందుల పిచికారి సులభంగా చేసుకోవచ్చన్నారు. తక్కువ మందుతో అతి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు స్ప్రే చేయవచ్చ న్నారు. మందుల పిచికారికి డ్రోన్ ఉపయోగిస్తే రైతుల ఆరోగ్యంపై రసాయణాల ప్రభావం ఉండదన్నారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం మన్నెగూడంలో కిసాన్ కపాస్ యాప్ గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట ఏఈవో రామ్‌చందర్ ఉన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగపర్చుకోవాలి

జైపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగపర్చుకోవాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహాలక్ష్మీ మండల సమాఖ్య ఆఫీస్‌లో మండల సమాఖ్య సభ్యులు, వీవోఏల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న సంఘాలకు రూ. 20 లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇస్తున్నారని, తీసుకున్న డబ్బులను నిత్యవసరాలకు కాకుండా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకుని తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. వీవో ఏలు బ్యాంకు లింకేజీలో పురోగతి సాధించడం, స్త్రీనిధిలో మొండి బకాయిలు ఉన్న వారందరు నవంబరు 10లోగా పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని లేని యెడల శాఖపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సర్వేను వీవోఏలు, ఎంఎస్‌వోబీలతో చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ అధ్యక్షురాలు మాలతి, సీసీలు ప్రశాంత్ కుమార్, శంకర్, రాజన్న, స్వర్ణలత, యశోదలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

కోటపల్లి, అక్టోబరు 23 (అంధ్రజ్యోతి) : మండలంలోని ఏదులబంధం గ్రామంలో విద్యుత్‌షాక్‌తో మూడు గేదెలు మృతిచెందాయి. గ్రామప్రాథమిక పాఠశాలకు విద్యుత్ సరఫరా చేసే తీగ సపోర్టు వైరుకు విద్యుత్ ప్రసారం కావడంతో మేతకు వచ్చిన మూడు గేదెలు వైరుకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. పాఠశాలకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన తీగకు సపోర్టు కోసం ఇనుప వైరును ఉపయోగించారు. ఈ తీగ విద్యుత్ లైన్‌కు తగిలి తెగి కింద పడడంతో గంట శ్రీనివాస్, అంగ రాజన్న, దుర్గం తిరుపతికి చెందిన మూడు గేదెలు మృతిచెందాయి. గేదెలు మృతిచెందడంతో తాము తీవ్రంగా నష్టపోయామని అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

పశువులకు టీకాలను వేయించాలి

భీమిని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మల్లీడి గ్రామంలో సుమారు 410 పశువులకు టీకాలను వేఏసినట్లు తెలిపారు. ప్రతి రైతు తమపశువులకు టీకాలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

గడువు పెంచినా లక్ష్యం చేరలే...!

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తు చేసేందుకు వెనుకంజ వేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా దరఖాస్తుదారులకు లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులకు కొత్త దుకా ణాలను కేటాయించనున్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే వైన్ షాపుల లై సెన్స్ కాలపరిమితి డిసెంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమై 2027 నవంబరు 30 వరకు అమలులో ఉండనుంది. డిసెంబరు ఒకటవ తేదీ నుంచే దుకాణా ల్లో మద్యం విక్రయాలు జరుగనున్నాయి.

27న లక్కీడ్రా..

వైన్ షాపులకు దాఖలైన టెండర్లకు ఈ నెల 27న లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో గల పీవీ ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గత మద్యం పాలసీలో గడువు ముగిసే సమయానికి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో మొత్తం 2242 దరఖాస్తులు రాగా, ఈ సారి దర ఖాస్తుల సంఖ్య 1712 దరఖాస్తులు వచ్చాయి. గత మద్యం పాలసీతో పోల్చితే దాదాపు 530 పై చిలుకు దరఖాస్తులు తగ్గాయి. ఒక్కో దరఖా స్తు రుసుం రూ. 3 లక్షలు కాగా ఈ ఏడాది సుమారు రూ. 15 కోట్ల 90 లక్షల ఆదాయం ప్రభుత్వానికి తగ్గింది.

విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి

కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం భీమారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిష్టర్‌లు పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో భోజనం అందించాలన్నారు. ఉపాధ్యాయులు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, సమయ పాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం ప్రబుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులను వేగవంతం చేయాలన్నారు. దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మధుసూదన్ పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి యువకుడి మృతి ?

భీమిని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన జాడి గోపాల్ (30) అనే యువకుడు జ్వరంతో బాధపడుతూ ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి మృతి చెందినట్లు తెలుస్తోంది. మూడు రోజులుగా జ్వరం రావడంతో గోపాల్ స్థానిక ఆర్‌ఎంపీని ఆశ్రయించాడు. మండలంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు బుధవారం సాయంత్రం రెండు ఇంజక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. స్థానిక ఆర్‌ఎంపీ వద్ద రెండు ఇంజక్షన్లు తీసుకున్నట్లు మృతుడు 108 సిబ్బందికి తెలిపారని సిబ్బంది పేర్కొన్నారు. జర్వం ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108లో బెల్లంపల్లికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలి స్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా సమాచారం అందలేదని తెలిపారు. మృతుడికి భార్య అనిత, రెండు నెలల బాబు ఉన్నారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ

లక్షెట్టిపేట, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులానికి చెందిన విద్యార్థినులు జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ రమాకళ్యాణి గురువారం తెలిపారు. ఇటీవల కళాశాల మైదానంలో జరిగిన అండర్ 14, అండర్ 17 బాలికల విభాగంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పలువురు విద్యార్థినులు అత్యున్నతమైన ప్రతిభ కనబర్చారని ఈనెల 28న నిర్వహించే రిజినల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన కలిగి ఉండాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం పనిచేస్తున్న పోలీసుల విధులు, చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులను అరికట్టేందుకు ఎంతో మంది పోలీసులు ప్రాణత్యాగాలు చేశారన్నారు. సైబర్ నేరాల గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలు, ఆయుధాలపై వివరించారు. ఎఎస్ఐ మజీద్‌ఖాన్, మిలింద్ కుమార్, కానిస్టేబుల్ చిరంజీవి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కోటపల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఎస్ఐ రాజేందర్ ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ రకాల రిజిష్టర్‌లు, ఎఫ్ఐఆర్, లాకర్ గది, ఆయుధాలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్ - 14 ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

హాజీపూర్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న అండర్-14 బాలబాలికల ఎంపిక పోటీలు గుడిపేట్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే హై స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ నాగజ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, పీడీ వంగళ సురేష్, జాయింట్ సెక్రటరీ భీమిని రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలతో పాటు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల25, 26 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. పాఠశాల సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు ఆవునూరి సురేష్, గుజ్జుల చందు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంరతం ప్రిన్సిపాల్ సేరు శ్రీధర్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రీత్విక్, అభిలాష్, శశికుమార్, రక్షిత్, హర్షిత్, మార్వత్, నిశ్వంత్, అశ్విత్, భానుతేజు అండర్-14 బాలుర విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు.

నంనూరు పాఠశాలను సందర్శించిన ఎంఈవో

హాజీపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : నంనూరు ప్రభుత్వ పాఠశాలను గురువారం ఎంఈవో తిరుపతిరెడ్డి సందర్శించి విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి బోధన ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రతి విద్యార్థి పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు దీర్ఘకాలంగా హాజరు కాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంటవారికి తగిన సూచనలు అందజేశారు. విద్యార్థుల ఆరోగ్యకరమైన భోజనంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.

పశు సంపదతోనే రైతుల అభివృద్ధి

దండేపల్లి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు అనుబం ధంగా పశువులను పెంచుకుని పశుసంపదను అభివృద్ధి చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చున్నాని మండల పశువైద్యధికారి డా. ధనరాజ్ అన్నారు. పశుసంవర్ధక శాఖ దండేపల్లి మండలం చింతపల్లిలో మేలైన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టికాలను వేసి పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్య సిబ్బంది శిరీష ఇందిర ఉన్నారు.

గిరిజన గూడాల్లో దండారీ సంబరాలు

కాసిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గూడాల్లో దసరా పున్నమితో మొదలైన దండారీ ఉత్సవాలు దీపావళి అమావాస్యతో ముగింపు పలుకుతారు. ఆదివాసీ గిరిజనులు అత్యంత పవిత్రంగా పూజించి ఆరాధించే పండగల్లో దండారీ ఉత్సవాలు అత్యంత ప్రధానమైనవి. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే దండారీ సంబరాలు 15 రోజుల పాటు గిరి జన గూడాల్లో కొనసాగుతాయి. కోరిన కోర్కెలు తీర్చ ఏడాదంతా పిల్ల పాపలను చల్లంగా చూసే గుస్సాడీ దేవుడికి గ్రామీణ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనులు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దండారీ బృందాలు ఒక ఊరి నుంచి మరో ఊరికి కాలినడకన వెళ్తుంటారు. గ్రామ పటేళ్లు ఆతిథ్యం ఇచ్చి ఆదరిస్తుంటారు. గుస్సాడీ బృందం సభ్యులు నియమ నిష్టలతో ఉంటూ పూజలు చేస్తారు. 15 రోజుల పాటు సాగే ఈ దండారీ ఉత్సవాలు గిరిజన గూడాల్లో హోరె త్తుతున్నాయి. కోలబోడితో ఈ పండగ ఉత్సవాలను ముగిస్తామని గిరిజన పూజారులు చెబుతున్నారు.

కాకో అమ్మావారికి ప్రత్యేక పూజలు

దండేపల్లి: గుడిరేవులో పద్మల్‌పూరీకాకో దేవాలయంలో గిరిజనులు ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. దండారీ ఉత్సవాలు ముగిస్తున్న నేపథ్యంలో గిరిజనులు కుటుంబ సమేతంగా వివిధ రాష్ట్రా లతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ గిరిజన గూడాల నుంచి వందలాది మంది తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



గిరిజనగూడంలో నృత్యాలు చేస్తున్న మహిళలు

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

తాండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేచిని గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు మైనింగ్ ఏడీ వైఖరిని నిరసిస్తూ గురువారం తాండూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ మంచిర్యాలమైనింగ్ ఏడీ తాండూర్ మండలంలో ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. మామూళ్లు ఇవ్వని ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సరఫరా కాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మైనింగ్ ఏడీ తన ఎస్ఆర్‌వోలకు చెప్పి మహిళ లబ్ధిదారుల ఫొటోలు తీయించి తన ఫోన్‌కు పంపమంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో లబ్దిదారులు విద్య, సౌక్య, రూప, మమత, స్వప్న, మాధవి, మ మత, సుమలత, శాంతబాయి, శారద, స్వప్న, సంధ్య పాల్గొన్నారు.

రైజింగ్ విజన్‌లో అందరూ భాగస్వాములు కావాలి

కాసిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సర్వేలో అందరు భాగస్వాములు కావాలని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ అన్నారు. గురువారం దేవాపూర్‌లో నిర్వహించిన భాగ్యలక్ష్మీ గ్రామైక్య సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి సమృద్ధి సమానత్వం , సుస్థిరతతో కూడిన ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో చేపట్టిన రైజింగ్ విజన్‌లో అందరు పాల్గొనాలని ఆయన సూచించారు. మహిళల చేత వారి స్మార్ట్‌ఫోన్‌లకు సర్వే లింక్ పంపించి వారి అభిప్రాయాలను సర్వేలో పొందుపర్చామన్నారు. ఈ నెల 25లోగా సర్వేలో అందరు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ రాయమల్లు, సంఘాల ప్రతినిధులు, వీవోఏలు , మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ అందజేత

దండేపల్లి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గుడిరేవు ప్ర భుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యుత్ శాఖ అధికారి ఏఈ కాశెట్టి శ్రీనివాస్ కంప్యూటర్‌ను అందించారు. గురువారం దండేపల్లి ప్రెస్ క్లబ్ సభ్యుల చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి బుచ్చన్న, ఉపాధ్యాయురాలు శ్యామల, విద్యార్థులకు అందజేశారు.

మహాసభల పోస్టర్ల విడుదల

తాండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26,27 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే తెలంగాణ మధ్యాహ్న బోజన పథకం కార్మిక యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లను గురువారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభల్లో మధ్యాహ్న బోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మల్లక్క, కమల, లక్ష్మీ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

తాండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌గా నియామకమైన శిరీషకు, ఆయా పోస్టుకు ఎంపికైన సరితకు గురువారం ఎంఈవో మల్లేశం నియామక పత్రాలను అందజేశారు. బోయపల్లి పాఠశాలలో విధులకు హాజరు కావాలని వారికి సూచించారు.


ప్రీప్రైమరీ స్కూల్‌లో నియామకాలపై విచారణ చేపట్టాలి



దండేపల్లిలో ఎంఈవో రాజుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహిళలు

దండేపల్లి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కొండాపూర్ ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్కూల్‌లో ఇటీవల ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్, ఆయాల పోస్టుల నియామకాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మహిళలు కోరారు. గురువారం దండేపల్లిలో విద్య వనరుల కేంద్రంలో ఎంఈవో మంత్రి రాజును కలిసి కొండాపూర్ చెందిన కొందరు మహిళలు వినతిపత్రాన్ని సమర్పించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ప్రీ ప్రైమరిలో పని చేసేందుకు ఇటీవల ఇన్‌స్ట్రక్టర్, ఆయాల పోస్టుల కోసం కొంత మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో గ్రామానికి చెందిన మహిళ పెళ్లి వేరే గ్రామానికి చెందిన వారిని ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, ఎడో తరగతిలో ఫెయిల్ అయిన వారిని ఆయాగా ఎంపిక చేశారన్నారు. ఈ నియామకం గ్రామానికి వారిని కాకుండా ఇతర గ్రామానికి చెందిన వారిని నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీనిపై డీఈవో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని వారు కోరారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న సిబ్బంది

హాజీపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : గుడిపేట 13వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంలో గుడిపేటలోని 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ పి. వెంకటరాములు ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది, అధికారులు, అలాగే బెజ్జూరు, చింతనమానపల్లి, జన్నారం ప్రాంతాల్లో పని చేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు. ఈ పోటీలు అమరవీరుల త్యాగాలు, పోలీసుల సేవాధర్మం, సమాజ రక్షణలో వారి పాత్ర వంటి అంశాలపై సాగాయి. ఈ కార్యక్రమం స్థానిక విద్యార్థుల ప్రోత్సాహానికి వేదికగా మారింది. గుడిపేట మౌంట్ కార్మెల్ పాఠశాల, మంచిర్యాల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు కూడా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉత్తమ వ్యాసాలు ఎంపికై విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వరరావు, కాళిదాస్, బాలయ్య తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



చెన్నూరులో కాంగ్రెస్‌ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లో గోరక్షకుడు ప్రశాంత్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ గురువారం రాత్రి చెన్నూరు పట్టణంలోని అంబేద్కర్ చౌ రస్తాలో బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ గో రక్షకుడుపై తూటా పేల్చిన ఎంఐఎం గుండా ఇబ్రహీం అనే వ్యక్తి అని తెలిసినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం గోవులను తరలించే వారికి అండగా ఉంటుందని, గోవులను కాపాడే గోరక్షకులనేమో అక్రమంగా అరెస్టు చేస్తూ హిందూ ధర్మం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ఇలాంటివి మున్ముందు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, నాయకులు బుర్ర రాజశేఖర్‌గౌడ్, కొండపాకచారి, రాజు, రాజేశ్వర్, వెంకటనర్సయ్య, శివకృష్ణ, వెంకటేష్, శంకర్, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, చిరంజీవి, శ్రీవర్ధన్, అభి, వెంకటేష్, శంకర్, మహేష్, రాజారాం, రాజేష్‌నర్సింహులు పాల్గొన్నారు.

గడువు పెంచినా లక్ష్యం చేరలే..



- మద్యం టెండర్ల దాఖలుకు స్పందన కరువు
- చివరి రోజు మందకొడిగా దరఖాస్తు ప్రక్రియ
- గడిచిన నాలుగు రోజుల్లోనూ దరఖాస్తులు అంతంతే
- ఈ నెల 27న లక్కీడ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక

మంచిర్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు టెండర్ల గడువు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 18వ తేదీతో ముగి సింది. ఆశించిన మేర టెండర్లు దాఖలు కాకపోవడంతో మరో ఐదు రోజుల పాటు గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ గడువు కూడా గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు పూర్తయింది. అప్పటి వరకు క్యూలైన్లలో ఉన్న వారికి టోకెన్లు ఇవ్వడం ద్వారా టెండర్లు దాఖలు చేసేందుకు అధి కారులు అవకాశం కల్పించారు. మొదటి గడువు ముగిసిన ఈ నెల 18వ తేదీ వరకు 1544 దరఖాస్తులు రాగా, తుది గడువు ముగిసే నాటికి ఒక రోజు ముందు వరకు 1634 టెండర్లు దాఖలయ్యాయి. చివరిరోజు భోజన విరామ సమయానికి ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాకపోగా, సాయంత్రం ఐదు గంటల వరకు గడువు ముగిసే సమయానికి 88 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన మొత్తంగా 1712 దరఖాస్తులు వచ్చాయి.

స్పందన అంతంతే..

వైన్ షాపుల టెండర్లు దాఖలుకు నోటిఫికేషన్ విడుదలై సుమారు 28 రోజులకు పైగా కావస్తున్నా ఆశించిన మేర టెండర్లు దాఖలు కాలేదు. కాగా ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. దీంతో 2025-2027 సంవత్సరానికిగాను కొత్త లైసెన్సుల జారీకి ప్రభుత్వం గత నెల 25న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 73 ఏ4 మద్యం షాపుల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించారు. గత మద్యం పాలసీలతో పోల్చితే..ఈ సారి ఆశించిన మేర టెండర్లు దాఖలు చేసేందుకు వ్యాపారుల నుంచి ఊహించిన విధంగా స్పందన లభించలేదు.



చివరి రోజు దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

దరఖాస్తు రుసుం పెరగడమే కారణమా...?

మద్యం షాపుల టెండర్లలో పాల్గొనదలిచే వ్యాపారులు గతంలో కంటే అధికంగా దరఖాస్తు రుసుము చెల్లించాల్సి వచ్చింది. రెండేళ్ల కాలపరిమితితో ఒక్కో షాపునకు దరఖాస్తు చేసేందుకు రూ. 3 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజును ప్రభుత్వం నిర్ణయిం చింది. గత మద్యం పాలసీలో దరఖాస్తు రుసుం రూ. 2 లక్షలు ఉండగా, ఈ సారి అదనంగా లక్ష రూపాయలను పెంచింది. దీంతో కొంతమేర చిన్నా చితక వ్యాపారులు (తరువాయి 7లో)

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

నస్పూర్, అక్టోంబరు 23 (ఆంధ్రజ్యోతి) :నస్పూర్‌లో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబరు 42లో తహసీల్దార్ కార్యాలయం, గ్రంథాలయం, ఐటీ ఆఫీస్‌లకు కేటాయించిన స్థలంలో అక్రమణలు తొలగించి ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టించమన్నారు.

'బీజేపీకి బుద్ధి చెప్పాలి'

చెన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబితేనే బీసీల రిజర్వేషన్‌లకు చట్ట బద్దత వస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. గురువారం చెన్నూరులో సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టే విధంగా బీసీ ఉద్యమం జరగాలన్నారు. రాష్ట్ర గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్డినెన్స్‌ను ఆమోదించాలని బీజేపీ ప్రతి నిధులు పోరాటం చేయడం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి చిత్త శుద్ధిని నిరూపించు కోవాలన్నారు. సమావేశంలో బోడెంకి చందు, రాజేశ్వరి, ఉమా రాణి, సమ్మక్క, చంద్రన్న, నగేష్, కరీం, రాజేశ్వరి,రాములు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జైపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలు 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారి సామ్రాట్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. అనారోగ్యం, అత్యవసర సమయాల్లో 108కు ఫోన్ చేయాలని, 15 నిమిషాల్లో చేరుకుంటుందన్నారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్, ప్రథమ చికిత్స, మందులు అందుబాటులోఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అధికారి సంపత్, సిబ్బంది లక్ష్మయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మంచిర్యాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల కరపత్రాలను గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ముందు విడుదల చేశారు. ఈసందర్భంగా మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ)మొట్టమొదటిసారిగా రాష్ట్ర మహాసభలు ఈ నెల 25, 26, 27న నిజామాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సాయితేజ, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జైపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుమట్ల గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి రూ. 1,77,240లను, 13 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్‌లు పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గురువారం టేకుమట్ల గ్రామ శివారు లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న వారిలో ముగ్గురు పారిపోగా 10 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, 8 సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. పేకాట వల్ల కుటుంబాల్లో గొడవలు జరుగుతాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. పేకాట స్థావరాలు ఎక్కడున్నా తమకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా కుటుంబాన్ని సరిగ్గా చూసుకోవాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

తాండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. గురువారం తాండూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యువకులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాహనాల తనిఖీలు చేపట్టాలని, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల రక్షణ కోసమే పోలీసులు పని చేస్తున్నారని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల ద్వారా శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ రవి కుమార్, సీఐ దేవయ్య, ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.



తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో మొక్కకు నీరు పోస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఇందిరమ్మ ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు
- అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి

లక్సెట్టిపేట, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద ప్రజల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం లక్సెట్టిపేట ఐబీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొంత మంది అవినీతి అధికారుల వల్ల తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుక, మొరం లాంటివి ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుందని లబ్ధిదారుడు కేవలం రవాణా ఖర్చులు భరిస్తే సరిపోతుందన్నారు. కానీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇవ్వాల్సిన మట్టి రియ ల్టర్లకు ఇస్తున్నారని వెంచర్లకు తరలిస్తున్నారన్నారు.

గత నెలలో దండేపల్లి మండలం నుంచి లక్సెట్టిపేట పట్టణంలోని ముస్లిం మైనార్టీ షాదీకాన కోసం వెయ్యి మెట్రిక్ టన్నుల మట్టి తరలించేందుకు మైనింగ్ ఏడీ జగన్‌మోహన్ రావు అనుమతులు ఇచ్చారని కానీ షాదీఖానాకు ఒక్క ట్రిప్పు కూడా పోయలేదని అక్కడి మొరం మొత్తం రియల్టర్లు తమ వెంచర్లలో పోసు కున్నారన్నారు. ఇప్పుడు ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న నిరుపేదలకు మట్టి దొరక్క నానా తం టాలు పడుతున్నారని కలెక్టర్ పూర్తి బాధ్యతలతో అవినీతి అధికారులపై ప్రత్యేక నిఘా పెట్టి వాళ్ల విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

వార్డెన్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే.

ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డ లక్సెట్టిపేట పోస్టు మెట్రిక్ హాస్టల్ వార్డెన్ బాల సంకుల రాజగోపాల్‌ను దివాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. ఆయనను వేధింపులకు గురి చేసిన అధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొంతమంది అవి నీతి అధికారులతో ముక్కుసూటిగా పని చేసే అధికారులు చేయలేకపోతున్నారన్న మాట వాస్తవం అన్నారు. అదనంగా బాధ్యతలు ఇస్తేనే ఇంతి అవినీతికి పాల్పడే అధికారి సురేష్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని అంతే కాకుండా నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఏఎస్‌డబ్ల్యూవో శ్రద్ధ తీసుకుని పెండింగ్‌లో ఉన్న పూర్తి బకాయిలు వెంటనే వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, నాయకులు రాజు, చాంద్, అంకతి వెంకటేష్ ఉన్నారు.

పోలీసుల సేవలు భావితరాలకు స్ఫూర్తి

ఎస్సై ఉపేందర్ రావు

నస్పూర్, అక్టోంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఉపేందర్ రావు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ మహిళ రక్షణ, పోలీసుల విధులు, సేవలు, యాంటీ నార్కోటిక్ చట్టాన్ని గౌరవించడం, ట్రాఫిక్ నియమాలు, ప్రతి ఒక్కరి బాధ్యతపై అవగాహన కల్పించారు. సాంకేతిక పరికరాలను ప్రదర్శించారు. పోలీస్ వ్యవస్థ పనితీరు విద్యార్థులకు పరిచయం చేసి వివరించారు. ఆయుధాల వినియోగం ప్రదర్శించి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబ ట్టారు. సీసీ కెమెరాల ప్రాధాన్యత, ఫింగర్ ప్రింట్, డివైజ్ ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్, 100 డయల్ విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బషీర్, పోలీస్ సి బ్బంది, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై ఉపేందర్‌రావు